## నవ్య వీక్లి - పసుపులేటి లక్ష్మినారాయణ స్మృతిసాహితి కథల పోటీలో

# రూ. 2,000 ప్రోత్సాహక బహుమతి పొందిన కథ

ఒకదాన్నొకటి తరుముకుంటూ వెంటిలేటర్ ఊచలపై వాలి ముక్కులు రుద్దుకుంటూ సరసాలాడుకుంటున్న పిచికల జంటని తదేకంగా చూస్తూకూర్చుంది హాస్పటల్లో బెడ్‌మీదున్న లలిత. అపుడపుడు అవి గదిలోకి వచ్చి బెడ్‌పక్కనున్న టీపాయ్‌మీద వాలుతున్నాయి. వాటి కిచకిచలు ఆహ్లాదంగా ఉన్నాయ్. నిన్న తనని పరామర్శించడానికి వస్తూ తన సహోద్యోగులు తెచ్చిన ద్రాక్షపళ్ల గుత్తులు టీపాయ్‌మీద అలాగే ఉన్నాయి. వాళ్ళు కాసేపు ఉండి జరిగిన దుస్సంఘటన పట్ల సానుభూతి కురిపించి వెళ్లారు. వాళ్ళు వెడుతూంటే వరండాలోంచి కొన్ని మాటలు వద్దనుకున్నా తన చెవిని లీలగా పడ్డాయి.

# విరేప్

## డి.ఆర్. ఇంద్ర

"పాపం షాక్ అయినట్టుంది. మనిషిలో చలనం లేదు. ఆషాక్‌లో ఒకోసారి బాధ తెలీనంతగా మనసు గెడ్డకట్టి మొద్దుబారిపోతుందట!"

"షాకా- గాడిదగుడ్డా? పెనుగులాడి నిరోధించేబదులు లొంగిపోయి బాగా ఎంజాయ్ చేసినట్టుంది. లేకపోతే తనకేమీ జరగనట్టు అంత నిర్లిప్తంగా ఎలా ఉంటుంది? అసలు ఏయేడుపూలేని ఈ దుంగని ఓదార్చడానికి రావడం మనదే బుద్ధి తక్కువ. బెల్లంకొట్టిన రాయిలా ఎంత నిర్వికారంగా ఎలా ఉందో చూడు."


"ఛ ఛ! అలా మాట్లాడకూడదే.."

భోరున ఏడవాల్సిన సందర్భంలో ఆ వ్యక్తి కంట తడికూడా కనిపించకపోతే పరామర్శించి వోదార్చడానికి వచ్చినవాళ్ళు బిత్తరపోతారు. ఏం చేయాలో తెలియక. ఏ ఆడదైనా భోరున ఏడ్చే అటువంటి సమయంలో లలితకళ్ళు చమర్చనైనా లేదు. బండరాయిలా నిశ్చలంగా ఉన్న లలితని చూసి ఎలా పరామర్శించాలో, అసలు పరామర్శించాలో, అఖ్ఖర్లేదో తెలియక సహోద్యోగులు తికమకపడ్డారు. తరువాత వాళ్ళే తేరుకుని, "నీకెంత కష్టం వచ్చింది లలితా!" అంటూ ముఖాలు విచారంగా పెట్టారు.

తను అత్యాచారానికి గురైంది(ట)! తనపై రేప్ జరిగింది అంటున్నారు డాక్టర్లు. తనకే తెలియదు తనకేం జరిగిందో! మొన్న ముసురుపట్టిన వర్షపురాత్రి ఆఫీస్ నుండి ఇంటికి ఆటోలో వెడుతూంటే.. ఆ ఆటోవాడు చీకట్లో సందుల్లోకి దారి మళ్ళించి తనపై అత్యాచారం చేయబోతే తను మొదట భీతిల్లినా, తేరుకుని పెనుగు లాడుతూ సహాయం కోసం అరుస్తూ, వాడిచేతిని కండ ఊడేలా కసిక్కున కొరికితే, వాడు రెచ్చిపోయి బలంగా తనగూబ పగిలేలా కొట్టాడు. ఆ దెబ్బకి కళ్ళు పచ్చబడి తను స్పృహ కోల్పోయింది. స్పృహలో లేని తనపై ఏం జరిగిందో తనకెలా తెలుస్తుంది? తన దేహానికి ఏం జరుగుతోందో 'తనకి' తెలియదు. ఆ బలమైన చెంపదెబ్బకి 'తను' ఏమైపోయింది? ఎక్కడికి పోయింది? తన దేహం ఉంది- 'తను' మాత్రం లేదు. ఏం జరిగిందో 'తనకి' తెలియదు కాబట్టి అత్యాచార అనుభవాన్ని దేహం అనుభవించింది తప్ప 'తను' అనుభవించలేదు. తన అనుభవాన్ని దేహం చెప్పలేదు. 'తను' మానభంగానికి గురైనట్టా- కానట్టా? ఇదేం వేదాంతం? మానభంగ వేదాంతం?

ఈ దేహం- తనుల విచికిత్స అలా ఉంచితే తనపై అత్యాచారం జరిగిందనేది మాత్రం భౌతికవాస్తవం. తనపై అత్యాచారం జరిగితే తనకెందుకు ఏడుపు రావడంలేదూ? తన మనసు మొద్దుబారి పోయిందా? అసలు అత్యాచారం అంటే ఏమిటి? తన ఇష్టానికి వ్యతిరేకంగా దౌర్జన్యంగా రుద్దబడే ఏ సంఘటనైనా అత్యాచారమే ఐతే, ఈ అత్యాచారం కొత్తకాదు. తన ఇష్టానికి వ్యతిరేకంగా తన జీవితంలో చాలా సంఘటనలు జరిగాయ్. కాని వాటిని లోకం అత్యాచారంగా వొప్పుకోదు. అత్యాచారానికి దాని నిర్వచనాలు దానివి. తనపై అత్యాచారం చేసిన ఆటోవాలపై తను కేసు పెట్టాలి అంటున్నారు అందరూ. వాడిని గుర్తు పట్టగలవా అని అడుగుతున్నారు. తనపై దౌర్జన్యం చేసినవాళ్లందరిపై కేసులు పెట్టాల్సివస్తే ఈ ఆటోవాడు ఎన్నోవాడు?

మొగ నలుసు కోసం చూస్తూంటే నువ్వెందుకు పుట్టావే అన్నట్టు తిరస్కారంగా చూసిన తల్లిదండ్రుల మీద కేసు పెట్టగలదా? నీ అన్నతోబాటు నిన్నూ బీటెక్కులు చదివించలేను. ఖర్చులేని కరస్పాండెన్స్ డిగ్రీతో సరిపుచ్చు




కోమని తన విద్యాదాహం మీద నీళ్ళు చల్లిన తండ్రిమీద కేసు పెట్టగలదా? చదువూ సంపాదనా ఉన్నా, భార్యని గౌరవించడం చేతగాక నిత్యం వేధించుకు తినే సంస్కారపు తక్కువ మొగుడుమీద కేసు పెట్టగలదా? నిత్యం తన అభిమానం భంగపడేచోట ఈ మానభంగానికి ఏడవాలా? తన ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా తనదేహంతో వాంఛ తీర్చుకునే మొగుడనే మొగాడు సుందరం రోజూ చేసేది మానభంగం కాదా? తన ఆరోగ్యం సరి లేదన్నా, తనకి మూడ్ లేదన్నా వినడు. రెండు నిమిషాలు సహకరించడానికి ఏడుస్తావెందుకూ అంటాడు విసుగ్గా. వంటికి కారం పూసినట్టు ప్రవర్తించేవాడికి సహకారం తక్కువయిందట! మొగుడైనాసరే భార్య ఇష్టానికి వ్యతిరేకంగా సంసారం చేయడం మానభంగంతో సమానమే అంటుంది(ట) చట్టం. కాని తనలాంటి ఏ ఆడది తనమొగుడు తనని మానభంగం చేసాడని కోర్టుకెక్కుతుంది? ఏ ఆడదీ అలా కోర్టుకెక్కదని తెలిసే ఈ కన్నీటి తుడుపు మొగ చట్టాలు. ఇవి మొగాళ్ళ చుట్టాలు. రేప్ కేసు సృష్టించే సంచలనం పబ్లిక్ మర్డర్ కేసుకూడా సృష్టించలేదు. అత్యాచారానికి

గుర్రైన స్త్రీ వంక లోకం చూసే విషపుముళ్ళ చూపులు భరించలేకే ఆ ఆడవాళ్ళు కోర్టులకెక్కరు.

ఈ విషయాలు తెలియని వనజ ఆ సమయంలో తను పెనుగులాడలేదనీ, ఆ అనుభవాన్ని ఎంజాయ్ చేసాననీ అంటోంది! పెనుగులాట! తనపై అత్యాచారం జరగబోతోందని తెల్సిన క్షణంలో ఒక్కసారి ఉప్పెనలా కమ్ముకున్న భయం, దుఃఖం, ఆగ్రహం, తెగింపుతో తను చేసిన పెనుగులాట మృగంలా మీదపడిన వాడిని నిరోధించ లేకపోయింది. అసలు అటువంటి సంఘటన





జరగవచ్చనే ఊహే తన కెపుడూ రాలేదు. కానీ, స్త్రీలు అటువంటి ఆపత్సమయాలలో ఆత్మరక్షణ ఎలా చేసుకోవాలనే అంశం మీద కొన్నాళ్ళ క్రితం ఒక టివి కార్యక్రమంలో చూసింది. అందులో సంఘంలో పేరున్న స్త్రీ పురుష ప్రముఖులు పాల్గొన్నారు.

ఎపుడు ఏదుండగుడు రేప్ చేస్తాడో అని ఓ చిన్న కారం డబ్బా రెడీగా హేండ్‌బేగ్‌లో పెట్టుకోవాలని ఓ మహిళామండలి అధ్యక్షురాలు అభిప్రాయం వెలిబుచ్చింది. కానీ ఆసమయంలో వణికే చేతుల్తో బేగ్ లోంచి కారండబ్బా తీసి వాడికళ్లల్లో చల్లే దాకా వాడూరుకుంటాడా? ఆ కంగారులో ఆ డబ్బా మూత రాకపోతే ఆ రేప్ గాడ్నే –'ఒరే అబ్బీ! కొంచెం ఈ డబ్బామూత తీసిపెట్టి ఓ క్షణం కదలకుండా నిలబడి కళ్ళల్లో కారం కొట్టించుకోవూ, ప్లీజ్ నా కోసం' అని రిక్వెష్ట్ చేయాలేమో అని తనకి నవ్వొచ్చింది ఆ సలహా వింటే. పూర్వకాలపు ఛేస్టిటీ బెల్ట్ (పాతివ్రత్యా పరిరక్షణా గోచీ?) లాటి దుంగల్లాటి రెండు లేక మూడు పేంటీలు తొడుక్కోవాలని ఓ క్లబ్ సెక్రటరీ సలహా ఇచ్చింది – పాపం అవి పీకలేక అలసి విరమించుకుంటాడని కాబోలు. అమెరికాలో కొంతమంది ఆడసైంటిష్టులు మనుషులు భరించలేని దుర్గంధాన్ని వెదజల్లే ఒక స్ప్రేని కనిపెట్టారట. రేపిస్ట్‌గారు ముందుకు దూకుతూంటే ఆగాగు అంటూ హేండ్‌బేగ్‌లోంచి ఆస్ప్రేయర్ తీసి వాడి ముఖం మీద స్ప్రే చేస్తే ఆదుర్వాసన భరించలేక పరుగూ పుచ్చుకుంటాడని ఆ ఆడ సైంటిష్టులు భరోసా ఇచ్చారట. కానీ ఆ రేపిష్టే ఆ స్ప్రేయర్ లాక్కుని ఆ ఆడశాల్తీమీదే స్ప్రే చేసి వాడిపని కానిచ్చుకుని పోడని గ్యారంటీ ఏమిటి? పైగా కొంతమంది మొగాళ్ళ కంపే ఆ స్ప్రేయర్ దుర్వాసనని తలదన్నుతుంది. వాళ్ళమీద ఆ స్ప్రే ఏం పనిచేస్తుంది?

ఒక పురాతన కాలపు మహాసాధ్వి- రెండు రూపాయల కాసంత కుంకుమబొట్టు నుదుట ప్రకాశిస్తున్నావిడ- ఆ సమయంలో దైవప్రార్థన చేయమంది. దైవం ఏదో ఒక రూపంలో వచ్చి రక్షించకపోడట! నిండు కౌరవసభలో దుశ్శాసనుడు ద్రౌపది వంటినున్న ఏక వస్త్రాన్ని వొలుస్తూన్న వేళ ద్రౌపది ప్రార్థన విని శ్రీకృష్ణుడు చేసిన అఖండ వస్త్రదాన సన్నివేశాన్ని ఆవిడ గాద్గదిక స్వరంతో కళ్ళమ్మట నీళ్ళు కారుతుండగా భక్తి ప్రపత్తులతో ఉదాహరించింది. అది వింటోంటే తనకి వళ్ళు మండింది. పెద్దలూ, నీతికోవిదులూ, దుంగల్లాటి ఐదుగురు మొగుళ్లూ, సభికులూ కళ్ళప్పగించి చూస్తూంటే పశుబలంతో దుశ్శాసనుడు చీర లాగుతోంటే, రెండు చేతులతో చీర పట్టుకుని పెనుగులాడి పెనుగులాడి అరచి, ఏడ్చి అలసి, లాభంలేక, ఊడిపోతూన్న చీరముడిని వొంటి చేత్తో పట్టుకుని నిరోధిస్తూ, వంటిచేత్తో నమస్కరిస్తూ మొరపెట్టుకున్నా, లాభంలేక ఇక లజ్జవిడిచి చీరపట్టుకున్న చేయికూడా వొదిలిపెట్టి రెండు చేతులూ జోడించి నువ్వే దిక్కని ఏడిస్తే అపుడు దిగొచ్చి వస్త్రదానం చేసాడట ఆ ఆర్తత్రాణ పరాయణుడు- ఆడదానికి ఆత్మాభిమానం కూడదని చెప్పిన పరమాత్ముడు! చీర విప్పబోయిన ఆ దుశ్శాసనుడుకంటే మానం మీది చేయి కూడా తీసేసి నమస్కరిస్తే గాని దిగిరాని ఆ కృష్ణుడే పెద్ద విలన్లా కనిపిస్తాడు తనకంటికి. ఆడదాని ఆత్మాభిమానానికి అందరూ శత్రువులే. దేవుడంటూ ఒకడు ఏడ్చాడో లేదో తనకి తెలీదుగానీ, తన అభిమానాన్ని చంపుకుని తన మానాన్ని కాపాడమని వాడ్ని ప్రార్థించదు.

ఆ కార్యక్రమంలో పాల్గొన్న ఒక సైకాలజిస్ట్ సలహా ఇస్తూ- రేప్‌ని తప్పించుకోలేనపుడు కామ్‌గా ఎంజాయ్ చెయ్యమన్నాడు. (వెన్ ద రేపీజ్ ఇనెవిటబుల్ కామ్లీ ఎంజ్‌య్ ఇట్ అట)! తద్వారా దుఃఖానుభవాన్ని సుఖానుభవంగా మార్చుకోవచ్చునట! డేకేది తను కాకపోతే తాటిపట్టికి ఎదురు డేకమన్నాడట ఇలాటివాడే. ఒక లేడీ కరాటే ఇనస్ట్రక్టర్ చెప్పిన సలహా తనకి నచ్చింది. ఆడవాళ్ళందరూ హైస్కూల్ స్థాయినుండీ కరాటే తప్పనిసరిగా నేర్చుకోవాలంది. అత్యాచారం చేయబోయే మొగాడి ఆయువుపట్టుమీద ఫెడీమని ఎలా ఈడ్చిపెట్టి తన్నాలో చెప్పింది. ఆ తాపుకి ఎద్దులాటి ఆ రేపిస్ట్ పాపిష్టువెధవ గాలితీసేసిన ట్యూబ్‌లా కుప్ప కూలిపోతాడట.



## అంతులేని కథ

కథల పోటీలో నా కథ 'ద రేప్'కు బహుమతి ప్రకటించినందుకు ధన్యవాదాలు

రాజమహేంద్రవరం గోదావరి తీర నివాసిని. వృత్తి సైకాలజిస్ట్. కథకుడుగా ఆంధ్రజ్యోతి పాఠకులకు పాతకాపునే!

ఒక వంక ఈ దేశం అంతరిక్షంలోకి ఉపగ్రహాలు పంపే సామర్థ్యం సంతరించుకున్నా, భారతీయ సమాజం మాత్రం ఇంకా సామాజికంగా పురాణ కాలంలోనే ఉందని భావిస్తాను, ఫ్యూడల్ భావజాలపు దాస్యంలోనే బతుకులీడుస్తూ. దాని కొనసాగింపే స్త్రీలపై అత్యాచార పర్వాలు. కొద్ది మంది స్త్రీలు రాజకీయాధికార పీఠాలకు చేరువై రాష్ట్రపతులు, ప్రధానులు, పార్టీల అధ్యక్షులు, మంత్రులు అయినా స్త్రీలకి వొరిగిందేమీ లేదు. బాధితులకి తక్షణ న్యాయం, నేరస్తులకు శిక్షలు విధించలేని పాలక, న్యాయ వ్యవస్థలు ఉన్నా లేనట్టే. ప్రజలు రాజకీయంగా, సామాజికంగా చైతన్యవంతులై ఈ దుష్టవ్యవస్థల్నీ కూలదోసే వరకు అంతులేని కథలా, ఈ వ్యవస్థలు ప్రజలతో ఆటలాడుకుంటూనే ఉంటాయి – ఇదే నా కథా నేపథ్యం.

**డి.ఆర్. ఇంద్ర**
**కౌన్సిలింగ్ సెంటర్, 86-15-6,**
**తిలక్‌రోడ్డు, రాజమండ్రి - 533 103,**
**సెల్: 94901 69068**

అది తనకి నచ్చింది. కానీ ఆ ట్రైనింగ్‌లు ఎందరు ఆడవాళ్ళకి అందుబాటులో ఉంటాయి? ఒకవేళ ఆ రేపిష్ట్ వెధవకి కూడా కరాటే వచ్చుంటే? అపుడు మళ్ళా కష్టమే. దేశంలో ఆడవాళ్ళు తప్ప మొగాళ్ళు కరాటేలూ గిరాటేలు నేర్చుకోకూడదని ఆడవాళ్ళ ఆడ చట్టం వస్తే తప్ప లాభం లేదు.

ఒక కాలేజి ఆడపిల్ల చాలా ఆవేశంగా చెప్పిన అభిప్రాయం తనకి ఇంకా బాగా నచ్చింది. ఇరాన్ దేశంలో ఆడవాళ్ళపై అత్యాచారం చేసిన రేపిష్టుని కాళ్ళు చేతులు వెనక్కి విరగకట్టి ఊరు నడిబొడ్డున ఈడ్చుకు వస్తారట. అక్కడ బాధితురాలి బంధువులు వాడ్ని చెప్పులతో కర్రల్తో చావగొట్టిన తరువాత అందరూ చూస్తూండగా క్రేన్‌కి వేలాడదీసి ఉరి తీస్తారట. కొన్ని ముస్లిం దేశాలలో రేప్ చేసినవాళ్ళని బహిరంగంగా శిరచ్ఛేదం చేస్తారట. మన దేశంలోనూ అటువంటి శిక్షలు విధించాలి అంది ఆవేశంలో ఊగిపోతూ. ఒక పెద్దాయన నవ్వి- అమ్మాయీ, పార్లమెంట్ మీదే దాడిచేసి దేశ సార్వభౌమత్వాన్నే వెటకారం చేసిన వాళ్ళనే ఉరితీయకుండా సర్వోపచారాలతో మేపుతున్న దేశంలో, నువ్వు అతిగా ఆలోచిస్తున్నావ్ అన్నాడు. ఏదైతే జరగాలో దాన్నిగురించి ఆలోచించడం అతి! ఆ చురుకైన ఆవేశపు అమ్మాయి ముఖం ఇంకా తనకళ్ళ ముందు కదులాడుతోంది.

అసలు ఇదంతా సుందరం మూర్ఖత్వం వల్ల, దాన్నెదుర్కోలేని తన అసమర్ధతవల్ల జరిగింది. తను సిటీబస్‌లోనే ఆఫీస్‌కి వెళ్ళివస్తే ఈ దుర్ఘటన జరిగి ఉండేది కాదు. కాని తను ఆఫీసుకి సిటిబస్సుల్లో వెళ్ళడం సుందరానికి నచ్చదు. కిక్కిరిసిన సిటీ బస్సుల్లో మొగాళ్ళు ఆడవాళ్ళని కావాలని తాకరాని చోట్ల తాకుతారనీ, అందువల్ల తను సిటి బస్సుల్లో ఆఫీసుకు వెళ్ళడాన్ని నిషేధించాడు. వొద్దన్నా వినక తనకోసం ఓ సెకెండ్‌హెండ్ మోపెడ్ కొన్నాడు. దాని మీదే ఆఫీస్‌కి వెళ్ళివస్తూ శరీర పవిత్రతని కాపాడుకోవాలని ఆర్డర్ పారేసాడు. భయంకరమ్మైన హెవీ ట్రాఫిక్‌లో తను బండినడపలేనని మొత్తుకున్నా విన్లేదు. సిటిబస్సుల్లో ఎక్కడోగాని పోకిరీలుండరని తన అనుభవం చెప్పింది. కానీ సుందరం తనమాట వినడు. వాళ్ళచేత 'వొత్తించుకోవడం' నీకు చాలా ఇష్టంలా ఉందే అని వెటకారాలాడాడు. తనని నొప్పించి లొంగదీయడం అతని పద్ధతి. అసభ్యకరమ్మైన తన కామెంట్స్ భార్యనెంత గాయపరుస్తాయో తెలుసుకునే సంస్కారం అతనికి లేదు. తను వాదన పొడిగిస్తే ఇంకా రెచ్చిపోతాడు. కొన్ని పదులు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆఫీస్‌కు ఉదయమూ, రాత్రీ మోపెడ్‌మీద వెళ్ళిరావడం తనకి ప్రాణాంతకమే అయేది. చాలాసార్లు చిన్న చిన్న ఏక్సిడెంట్లతో ప్రాణాలతో బయటపడింది. ఎంతమంది ఆడవాళ్ళు మోపెడ్ల మీద వెళ్ళడం లేదూ? వళ్ళు దగ్గరపెట్టుకుని నడుపు అన్నాడు. సిటీబస్ మాట ఎత్తడానికి వీల్లేదన్నాడు. తన బతుకు దినదినగండమే అయింది.

మొన్న ఆఫీస్ తనిఖీ సందర్భంగా బాగా లేటయింది. దానికితోడు తుఫాన్ వర్షం. రాత్రి పదయింది. సూదుల్లాగుచ్చుతూ వాన. ఎదురుగా వచ్చే వాహనాలు వెల్తురుకి కళ్ళు బైర్లు కమ్మి ఏ వాహనం కిందపడో చావడం ఖాయం అనుకుంది. సగం దూరంలో మోపెడ్ మొరాయించి ఆగిపోయింది. దాని మెకానిజం తనకేమీ తెలియదు. ఏం చేయాలో తోచలేదు. సిటీబస్ ఎక్కుదామనుకుంటే మోపెడ్‌ని ఏం చేయాలో తెలియదు. మూసేస్తున్న ఓ షాపు అతన్ని రిక్వెస్ట్ చేసి మరునాడు వచ్చి తీసుకుంటానని చెప్పి మోపెడ్‌ని షాపులో పెట్టింది. సిటిబస్ కోసం నిరీక్షించి అవి రాకపోతే, ఖాళీగా వస్తోన్న ఆటోని ఆపి ఎక్కింది.... వాడు ఇంతపని చేసాడు. తన రేప్ వార్త లోకమంతా టామ్‌టామ్ అయింది. ఈరోజు పేపర్లో కూడా వచ్చింది తనపేరు, వివరాలతో సహా.

మాలో ఈ రేప్‌లు లేవు, ఎంత చక్కగా ఉన్నామో చూడు, ఈ మనుషుల్తో మానేసి మాతో స్నేహం చేయకూడదూ ఎంచక్కా అన్నట్టు పిచికల జంట టీపాయ్ మీద నుండి చేతికందే దూరంలో బెడ్‌మీద సంచరిస్తున్నాయి. దగ్గరవుతున్న అడుగుల చప్పుడుకి గుమ్మంవైపు చూసింది. ఎదురుగా టిఫెన్ పొట్లం, కాఫీ ఫ్లాస్క్‌తో కామేశ్వరి. అవేకాక ఆమె చేతుల్లో హాస్పటల్ బిల్ కట్టిన రసీదు కూడా ఉంది. తల్లిదండ్రులకన్నా, కట్టుకున్న మొగుడుకన్నా ఎక్కువగా, దెబ్బతిన్న బిడ్డని అక్కున చేర్చుకునే తల్లిలా తనని చూసుకునే కామేశ్వరి రెండు రోజులుగా తనకి సపర్యలు చేస్తూ హాస్పటల్లోనే ఉంది. కామేశ్వరి తన కొలీగ్ కాదు. తోడపుట్టినదీ కాదు. తన ఆఫీస్‌లో ఆఫీసు శుభ్రంగా తుడుస్తూ అందరికీ కావలసినవి తెచ్చిపెట్టే ఆడ అటెండర్. హాస్పటల్లో తనకి సేవ చేయడం ఆమె ఆఫీసు విధికాదు. ఐనా ఆఫీసుకి ఎగనామం పెట్టి తనకూడా ఉంది కంటికి రెప్పలా తనని చూసుకుంటూ.

".... ఎన్నిసార్లు ఫోన్ చేసినా అయ్యగారు ఫోన్ ఎత్తక పోవడంతో మీ ఇంటికి వెళ్ళాను.. నన్ను చూస్తూనే అయ్యగారు నా ముఖాన్నే తలుపులు వేసేసుకున్నారు..." క్షమాపణ చెప్పినట్టు చెప్పింది కామేశ్వరి టిఫిన్ పొట్లం విప్పుతూ. లలిత ఏమీ మాట్లాడలేదు. తనపై రేప్ జరిగినట్టు తెలిసిన వాళ్ళంతా వచ్చి పరామర్శించి వెళ్ళారు- మొగుడు సుందరం తప్ప. అతను రాడని తనకి మాత్రమే తెలుసు.

సుందరం చాలా శుభ్రమ్మైన మనిషి. అపరిశుభ్రతను ఏమాత్రం సహించడు. పెళ్ళయిన మరునాడు తన ముఖం తుడుచుకుని ఆ టవల్‌ని అతనికి ఇవ్వబోతే- ఒకళ్ళు తుడుచుకున్న దాంతో నేనెపుడు తుడుచుకోను. నాకెపుడు అలా ఇవ్వకు అన్నాడు. ఒకళ్ళు! అతని కంచం మంచం, సబ్బు టవల్ అన్నీ వేరే. అవి ఎవరూ వాడకూడదు. ఇతరులు వాడనవి అతను వాడడు. ఎవరైనా తెలియక అతని వస్తువులు ముట్టుకుంటే సుందరం వాటిని బయట పారేస్తాడు తప్ప తను తిరిగి వాటిని వాడడు. ఇపుడు తనని మరొకరు ముట్టుకోవడమే గాక వాడుకున్నారు కూడా. తను ఇంక సుందరం వాడుకోడానికి పనికిరాదు. తనని వాడుకోడానికి సమాజమూ, చట్టాలూ సుందరానికి లైసెన్స్ ఇస్తే- లైసెన్స్ లేని మరొకడు తన్ను వాడుకుంటే ఆ లైసెన్స్ దారుడికెంత నష్టం పాపం!

ఈ లైసెన్స్‌ల గొడవ తెలియని పెళ్ళికాని అమాయక కామేశ్వరి అమాయకంగా అడుగుతోంది- ... పోనీ మీరు ఒకసారి అయ్యగారికి ఫోన్ చేయకూడదూ... అని. లలిత జవాబివ్వలేదు. టీవిలో ప్రసారం అవుతూన్న ఆగష్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ప్రత్యక్ష ప్రసారాన్ని చూస్తోంది. కిలోమీటర్ల పొడవునా త్రివిధ రక్షక దళాల గంభీరమ్మైన కవాతులు. గాల్లోకి ఎక్కుపెట్టిన క్షిపణుల వాహనాలు, రంగు రంగుల బేండ్ మేళాలు, ఆకాశంలో యుద్ధ విమానాల విన్యాసాలు, బులెట్ ప్రూఫ్ కవచపు గ్లాస్ బాక్స్‌లోంచి ఉపన్యాసాలు, కన్నుల పండువగా జెండావందనాలు, శెల్యూట్‌లు, బూట్ల యూనిఫారపు పదఘట్టనలు, హెలికాప్టర్లలోంచి పూలవర్షం.. కామేశ్వరి కూడా కళ్ళప్పగించి చూస్తోంది టీవీ వంక. లలితని ఏదో అడగాలనుకుంటోంది... కానీ అడగడానికి సంకోచిస్తోంది... ఇదంతా.. ఇదంతా.. ఓ పచ్చి మోసం, దగా, ఈ ఆర్భాటం, హంగామా అంతా ఓ డ్రామా కదూ అని అడగాలనేమో.. అవును ఈ కనిపించేదంతా ఓ కనికట్టు.. ఈ ప్రజాస్వామ్యం ఓ మేడిపండు అనుకుంటూ... లలిత టీవీ కట్టేసి లేచింది.

కామేశ్వరి భుజాన్ని ఊతగా పట్టుకుని హాస్పటల్ మెట్లు దిగుతూంటే కామేశ్వరి సందేహంగా అడిగింది ఎక్కడికని.

"నీకు తెల్సిన ఏదైనా మంచి వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌కి తీసుకువెళ్ళు" అంది లలిత.

"... బెంగగా ఉందా?" ఆర్ద్రతతో అడిగింది కామేశ్వరి లలితను పొదివిపట్టుకుని.

"లేదు. ఇంక నేను సిటీబస్‌లోనే ఆఫీసుకి వెళ్ళే స్వేచ్ఛ లభించినందుకు సంతోషంగా ఉంది." అంది లలిత నవ్వడానికి వోపిక తెచ్చుకుంటూ.

★